

రారండోయ్.. అంజన్న వేడుక చూద్దాం.!

గండి వీరాంజనేయస్వామి ఆలయంలో ఆగస్టు 5 నుంచి శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. - 8లో



కడప జట్టు జయకేతనం

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు విజయం సాధించింది. - 8లో

గరిష్టం/కనిష్టం
35.6/25.4

వాతావరణం

జిల్లాలో మంగళవారం 25.4 - 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

తప్పుల సవరణకు ఆగస్టు 4వరకు గడువు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మున్సిపల్ యాజమాన్యాలలో పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కేడర్ సంఖ్యను, ఉపాధ్యాయ ప్రొఫైల్ డేటాను www.studentinfo.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేశామని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఉపాధ్యాయులు నమోదు చేసిన వివరాలు పరిశీలించి ప్రస్తుత క్యాడర్‌లో చేరిన తేదీ, ప్రస్తుత పాఠశాలలో చేరిన తేదీ, అకడమిక్ అర్హత లేని సబ్జెక్టులు, బీఈడీ మెథడాలజీ సబ్జెక్టులలో తప్పులేమైనా ఉంటే సరిచేసేందుకు ఈ నెల 4వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడు పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు



కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిధిలోని కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన అభ్యర్థులు ఫీజు రియింబర్స్‌మెంట్‌కు అనర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు తమ పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు రెండు సెట్లు జిరాక్స్ కాపీలు తమ వెంట తీసుకుని రావాలని సూచించారు.

ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు నోటిఫికేషన్ విడుదలైందని డీఈఓ మర్రెడ్డి అనురాధ, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి తెలిపారు. పదో తరగతిలో చేరేందుకు 14 సంవత్సరాలు నిండిన వారు, ఇంటర్‌లో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై 15 సంవత్సరాలు నిండిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 27వ తేదీ వరకు గడువు ఉందన్నారు. రూ. 200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 4వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీని సంప్రదించాలని సూచించారు.

మత్స్యకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి

కడప అగ్రికల్చర్: జిల్లాలోని ప్రాథమిక మత్స్య సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ఆర్థికంగా తోడ్పాటునిస్తుందని జిల్లా మత్స్యశాఖ అధికారి శాంతి తెలిపారు. మంగళవారం జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో మత్స్యకార సంఘాలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక మత్స్యకార సంఘాలను చేపల రైతుల ఉత్పత్తిదారుల సమాఖ్యలుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందుకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ఆర్థికంగా తోడ్పాటు ఇస్తుందన్నారు. సంఘాలకు సంబంధించిన పుస్తకాలు, వ్యాపార లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు ఇతర సభ్యులు, గ్రామ మత్స్య సహాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు భద్రత కల్పించాలి




మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి

సుండుపల్లె: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన అవసరం ఉందని రాజంపేట డివిజన్ సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి సూచించారు. మంగళవారం సుండుపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డుల గదిని పరిశీలించారు. కార్యాలయ ఉద్యోగుల సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో ఎక్కడా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా భద్రత కల్పించాలని సూచించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది స్వాగతం పలికారు.

గూడు కట్టుకున్న వేదన

- కొత్తగా మంజూరయ్యే పీఎంఏవై ఇళ్లకు రూ.4లక్షలు
- పెండింగ్‌లో ఉన్న ఇళ్ల లబ్ధిదారులకు మొండిచేయి
- పాత బిల్లు బకాయిలపై కొరవడిన స్పష్టత
- తమపై కరుణ చూపాలని లబ్ధిదారుల వేడుకోలు





వివిధ దశలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

నియోజకవర్గం	మంజూరైన ఇళ్లు	బీఎల్ లెవెల్	ఆర్‌ఎల్ లెవెల్	ఆర్సీ లెవెల్
బద్వేలు	11,395	2,233	1,275	1,512
మైదుకూరు	7,782	1467	1154	456
ప్రొద్దుటూరు	21,373	9956	2263	1775
జమ్మలమడుగు	9678	2447	958	296
పులివెందుల	19634	4342	3002	1792
కమలాపురం	5260	883	716	200
కడప	22958	11941	1508	946
రాజంపేట	2280	396	223	66
మొత్తం	100128	33665	11099	7043

సాక్షి ప్రతినిధి, కడప: వారంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు. హౌసింగ్ పథకానికి అర్హులు. ఇళ్లు మంజూరైనా పరిస్థితుల ప్రభావం కారణంగా నిర్మాణం పూర్తి కాలేదు. చేయూత ఇవ్వాల్సిన ప్రభుత్వం కొత్తగా ఎంపిక చేసే లబ్ధిదారులను మాత్రమే ప్రోత్సహిస్తోంది. పథకం ఒక్కటే అయినప్పటికీ నూతన నిబంధనలు మునుపటి లబ్ధిదారులకు వర్తించవని చెబుతోంది. ఇదెక్కడి న్యాయం.. మా 'గూడు-గోడు' పట్టించుకోవాలని జిల్లా వ్యాప్తంగా 67వేల మంది లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం (పీఎంఏవై) ద్వారా జిల్లాలో 1,00,128 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 99,413 మంది లబ్ధిదారుల జియో ట్యాగింగ్ చేశారు. అందులో 96,977 మందికి రిజిస్ట్రేషన్లు అయ్యాయి. కాగా 33,022 మంది ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. ఇదివరకూ పీఎంఏవై కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు రూ.1.50 లక్షలు నిధులు, రూ.30వేలు ఉపాధి హామీ పథకంలో అనుసంధానం, రూ.50 వేలు బ్యాంకు రుణం మొత్తంగా రూ.2.30లక్షలు వర్తించేది. తాజా ఉత్తర్వుల్లో ఆ మొత్తం రూ.4లక్షలకు పెంచారు. సంతోషించాల్సిన సమయంలో మునుపటి లబ్ధిదారులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా మంజూరయ్యే లబ్ధిదారులకు మాత్రమే రూ.4లక్షలు వర్తించేలా నిర్ణయించారు. దాంతో 'మేమేమి చేశాం పాపం' అంటూ నిరుపేదలు ఆవేదన చెందుతున్నారు.

రూ.4లక్షలు కేటాయింపు

పట్టణాభివృద్ధి సంస్థల్లో పేదలకు మేలు చేసేందుకు ఇళ్ల నిర్మాణాలకు కేటాయింపుల వ్యయం పెంచారు. పీఎంఏవై పథకం ద్వారా పట్టణాల్లో బీపీఎల్ పరిధిలో ఉన్న వారికి పక్కా ఇళ్ల నిర్మాణానికి రూ.4లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కేంద్ర ప్రభుత్వం రూ.2.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.5 లక్షల వాటా ప్రకారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా కొత్తగా ఎంపికయ్యే లబ్ధిదారులకు మాత్రమే తాజా నిబంధనలు వర్తిస్తాయని మెలిక పెట్టారు. పీఎంఏవై పథకంలో మంజూరై ఇళ్ల నిర్మాణం పూర్తి కాని లబ్ధిదారులు జిల్లాలో 67,106 మంది ఉన్నారు. వీరంతా పాతరేట్ల ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. ఇదేమి అన్యాయం ఆర్థిక స్తోమత లేకే మా ఇళ్లు పూర్తి కాలేదని, మాకు కూడా కొత్త నిబంధనలు వర్తింపజేయాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వ పెద్దలు పెద్ద మనస్సుతో సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

నిర్మాణంలో ఉన్న ఇళ్లకు రూ.4లక్షలు వర్తింపజేయాలి



పేదల కోసం ప్రొద్దుటూరు ప్రాంతంలో సుమారు రూ.20వేల ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో కొన్ని ఇళ్లు పూర్తయ్యే దశకు చేరుకోగా చాలా వరకు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒకే మారు పేదలందరికి ఇళ్లు మంజూరు చేయడంతో నిర్మాణంలో ఆలస్యం జరిగింది. నిర్మాణంలో ఉన్న ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ.4లక్షలు మంజూరు చేయాలి.
– చింపిరి అనిల్ కుమార్, 39వ వార్డు కౌన్సిలర్, ప్రొద్దుటూరు

ఇంటి నిర్మాణానికి ఇబ్బందులు పడుతున్నాం



నాకు రామేశ్వరం జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటి నిర్మాణానికి ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటి వరకు పునాదులు మాత్రమే నిర్మించారు. మా లాంటి వారికి రూ.4లక్షలు మంజూరు చేస్తే ప్రభుత్వం చేయూతనిచ్చినట్లు అవుతుంది.
– కాటం లక్ష్మీదేవి, ప్రొద్దుటూరు.

పేదలను ప్రభుత్వం ఆదుకోవాలి



నాకు బొల్లవరం జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం ఇచ్చే ఇళ్లల్లో పేదలు మాత్రమే నివాసం ఉంటారు. ఇళ్లను త్వరగా నిర్మించడంతోపాటు నిర్మాణానికి అవసరమైన డబ్బును ప్రభుత్వం జాప్యం లేకుండా ఇవ్వాలి. నిర్మాణం జరుగుతున్న ప్రతి ఇంటికి రూ.4లక్షలు వర్తింపజేయాలి.
– వద్ది వెంకటమ్మ, ప్రొద్దుటూరు.

1వ తేదీనే వంద శాతం పెన్షన్ల పంపిణీ

- కలెక్టర్ శివశంకర్ లోతేటి



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్ : ఆగస్టు 1వ తేదీన 'ఎన్టీఆర్ భరోసా పెన్షన్' లబ్ధిదారులందరికీ ఇంటి వద్దనే 100 శాతం పెన్షన్ పంపిణీ చేసేలా అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం విజయవాడ సీఎస్ క్యాంప్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటితో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, కుడ వీసీ వై.ఓ.నందన్, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ రాకేష్, డీఆర్‌డీఏ ఏపీడీ ప్రసాద్, తదితరులు హాజరయ్యారు. సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో ఆగస్టు ఒకటవ తేదీనే 100 శాతం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు 31వ తేదీ మధ్యాహ్నంలోగా సంబంధిత బ్యాంకుల నుంచి పెన్షన్ మొత్తాన్ని ముందే డ్రా చేసుకొని పంపిణీకి సిద్ధం చేసుకోవాలన్నారు. ఆగస్టు 1వ తేదీన ఉదయం 5.30 గంటలకే సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి 6 గంటలకే పెన్షన్ మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్త వహించాలన్నారు. పెన్షన్లు పొందే లబ్ధిదారులందరూ ఇళ్లవద్ద అందుబాటులో ఉండి పంపిణీ చేసే సిబ్బందికి సహకరించాలన్నారు.

నేరాల నియంత్రణలో పోలీసు అధికారులదే కీలకపాత్ర



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్: రాష్ట్రంలో నేరాల నియంత్రణలో పోలీసు అధికారులదే కీలకపాత్ర అని రాష్ట్ర హోం శాఖామంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలతో విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. కడప నుంచి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంశాఖ మంత్రి మాట్లాడుతూ మహిళల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, సైబర్ నేరాలను అరికట్టేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ జి. వెంకటరాముడు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్. సుధాకర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ యు. వెంకటకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో భావితరాలకు ఆదర్శం కావాలి

సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్రచౌధురి



కడప కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న రాజేంద్ర చౌధురి

వైవీయూ: చెట్ల పెంపకమే భవిష్యత్ తరాలకు అందించే గొప్ప బహుమతి అని, పర్యావరణాన్ని కాపాడుకుని భావితరాలకు మేలు చేయటమే గాక వారికి ఆదర్శంగా నిలవాలని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌధురి పిలుపునిచ్చారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'అమ్మ పేరిట ఒక మొక్క' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్ర చౌధురి, కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీం బాషా మాట్లాడుతూ పర్యావరణం - ప్రగతిని సమన్వయం చేసుకుని ముందుకు సాగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ ప్రజంటేషన్‌పై పోటీలు నిర్వహించి విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కడప క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కార్యాలయ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ శచీదేవి, నాగరత్నమ్మ, అనూరాధ, వాహిదా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు బండి.. ప్రయాణం కష్టమండి!



బస్సు ప్రయాణంతో పోలిస్తే రైలు ప్రయాణం ఎంతో సౌకర్యవంతం. టిక్కెట్ ధర తక్కువ.. సమయం ఆదా అవుతుంది. అందుకే చాలా మంది రైలులో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కనీస సౌకర్యాలు కల్పించాలనే స్పృహ రైల్వేశాఖకు కొరవడింది. ఫలితంగా రైలు ప్రయాణం నకరప్రాయంగా మారుతోంది.

- భారంగా మారుతున్న రైలు ప్రయాణం
- స్లీపర్ కోచ్‌ల తగ్గింపు
- ఏసీ కోచ్‌ల పెంపు
- జనరల్ బోగీలపై చిన్నచూపు
- కాలు మోపేందుకు వీలులేని పరిస్థితి
- రైల్వేశాఖ తీరుతో సామాన్యులకు తప్పని ఇక్కట్లు



రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

కడప కోటిరెడ్డిసర్కిల్/అర్బన్: రైలు ప్రయాణం సామాన్యులకు భారంగా మారుతోంది. ఒకప్పుడు స్లీపర్ కోచ్‌లు అధికంగా ఉండగా, ఏసీ కోచ్‌లు తక్కువగా ఉండేవి. కరోనా తర్వాత నుంచి రైల్వేశాఖ ఆదాయమే పరమావధిగా భావించి...ఒక్కొక్కటిగా స్లీపర్ కోచ్‌లను తగ్గిస్తూ దాని స్థానంలో ఏసీ కోచ్‌లను పెంచుకుంటూ పోతోంది. ఆ తర్వాత జనరల్ బోగీల పరిస్థితి చెప్పనక్కరలేదు. అటు స్లీపర్‌లో సీటు లభించక, ఇటు జనరల్ బోగీలలో చోటు సంపాదించలేక సామాన్య ప్రయాణికులు నరకాన్ని అనుభవిస్తున్నారు.

కడప మీదుగా వెళ్లే రైళ్ల పరిస్థితి

కడప మీదుగా ప్రతిరోజు డైలీ 24 రైళ్లు, వీక్లీ 28 రైళ్లు నడుస్తున్నాయి. వీటిలో చిత్తూరు-కాచిగూడ మధ్య నడిచే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో గతంలో 13 స్లీపర్ బోగీలు ఉండగా, ప్రస్తుతం 10 ఉన్నాయి. త్రీ టైర్‌లో మూడు బోగీలు ఉండగా, ప్రస్తుతం 5కు పెంచారు. చెన్నై-ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలులో గతంలో స్లీపర్ కోచ్‌లు 9 ఉండగా, ప్రస్తుతం 2 మాత్రమే ఉన్నాయి. త్రీ టైర్ ఏసీ బోగీలను మూడు నుంచి ఏకంగా ఎనిమిదికి పెంచారు. ఈ రైలులో స్లీపర్ టిక్కెట్లు లభించడం దాదాపు అసాధ్యంగా మారింది. కడప నుంచి విశాఖపట్టణం వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలులో 12 స్లీపర్ కోచ్‌లు ఉండగా, వాటిని ఆరుకు కుదించారు. అలాగే త్రీ టైర్ ఏసీలు మూడు నుంచి ఎనిమిదికి పెంచారు. దీంతో విశాఖపట్టణం వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కన్యాకుమారి నుంచి పూణె వెళ్లే జయంతి ఎక్స్‌ప్రెస్‌లో గతంలో 9 స్లీపర్ కోచ్‌లు ఉండగా, వాటిని ఆరుకు కుదించారు. త్రీ టైర్ రెండు బోగీల నుంచి ఎనిమిది బోగీలకు పెంచారు. రైల్వేశాఖ ఆదాయమే లక్ష్యంగా ఏసీ కోచ్‌లను పెంచుకోవడంలో తప్పు లేదుగానీ స్లీపర్ బోగీలను తగ్గించడం పలు విమర్శలకు తావిస్తోంది.

స్లీపర్ కోచ్‌లు పెంచితేనే సౌకర్యవంతం

గతంలో రైళ్లకు ముందు రెండు, వెనుక రెండు చొప్పున మొత్తం నాలుగు జనరల్ బోగీలు ఉండేవి. ప్రస్తుతం వాటిని రెండుకు మాత్రమే కుదించారు. దీంతో ఆ బోగీలు కిటకిటలాడుతున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రెండు జనరల్ కోచ్‌లను పెంచుతున్నట్లు ప్రకటించింది. కడప మీదుగా వెళ్లే ప్రధాన రైళ్లకు వాటిని అమర్చితే కొంత ప్రయోజనం కలగనుంది. అలాగే స్లీపర్ కోచ్‌లను కూడా పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జనరల్ బోగీలు కిటకిట


సాధారణంగా రైళ్లలో జనరల్ బోగీలు ఐసీఎఫ్ కోచ్ (ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ)లో 90 మంది, ఎల్‌హెచ్‌బీ కోచ్‌లో 110 మంది వరకు కూర్చొని ప్రయాణించవచ్చు. అయితే ప్రస్తుతం 200-250, 300 మంది వరకు జనరల్ బోగీల్లో ప్రయాణిస్తున్నారు. నిత్యం కిటకిటలాడే జనరల్ బోగీల్లో కనీసం ఎక్కడానికి కూడా వీలు కాని పరిస్థితి నెలకొంది. దీంతో చాలామంది స్లీపర్ కోచ్‌లలో ప్రయాణిస్తున్నారు. మరోవైపు స్లీపర్ టిక్కెట్ల కోసం చూస్తే రిజర్వేషన్ దొరకడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు త్రీ టైర్‌లో ఏసీ టిక్కెట్లు తీసుకుని ప్రయాణిస్తున్నారు. ఒకవైపు ఏసీ టిక్కెట్లు భారమైనా ప్రయాణించక తప్పడం లేదు.



జనరల్ బోగీలోకి ఎగబడుతున్న ప్రయాణికులు


రైలు పేరు	జనరల్ గతం	జనరల్ ప్రస్తుతం	స్లీపర్ గతం	స్లీపర్ ప్రస్తుతం	3 టైర్ గతం	3 టైర్ ప్రస్తుతం	2 టైర్ గతం	2 టైర్ ప్రస్తుతం
తిరుమల	03	02	12	06	03	08	02	02
వెంకటాద్రి	02	02	13	10	03	05	02	02
రాయలసీమ	02	02	07	09	01	06	01	02
చెన్నై-ముంబయి	02	02	09	02	03	08	01	02
జయంతి	02	02	09	06	02	08	01	01

టిక్కెట్ దొరకడం కష్టం




కడప నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే స్లీపర్‌లో టిక్కెట్ దొరకడం కష్టంగా ఉంది. కడప నుంచి విశాఖపట్టణం, ముంబయి, చెన్నై, హైదరాబాదు, షిర్డి, ఢిల్లీ తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే 30-60 రోజుల ముందే రిజర్వేషన్ చేసుకోవాల్సి వస్తోంది. రైల్వే టిక్కెట్లు లభించకపోవడంతో పలుమార్లు బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది.
– వడ్డె ఎర్రిస్వామి, ఆత్మకూరు, అనంతపురం జిల్లా

జనరల్ బోగీ ప్రయాణం నరకమే



కడప మీదుగా పలు ప్రాంతాలకు వెళుతున్న రైళ్లలో ముందు, వెనుక ఒక్కొక్కటి మాత్రమే జనరల్ బోగీ ఉండడంతో బోగీలోకి ఎక్కాలంటే అనేక వ్యయప్రయాసలు ఎదుర్కోవాల్సి వస్తోంది. గమ్యస్థానం వచ్చే వరకు నిలబడి ప్రయాణించక తప్పడం లేదు. అడుగు తీసి అడుగు కూడా పెట్టలేని స్థితిలో గత్యంతరం లేక మరుగుదొడ్డి వద్ద కూర్చొని ప్రయాణించాల్సి వస్తోంది. రైల్వేలో జనరల్ బోగీల సంఖ్య పెంచితే ప్రయోజనకరంగా ఉంటుంది.
– రసూల్, కడప

రైళ్ల సంఖ్య పెంచాలి



కడప నుంచి పలు ప్రధాన నగరాలకు రైళ్లు ఒకటి లేక రెండు మాత్రమే నడుస్తున్నాయి. కొన్ని ప్రాంతాలకు ఒక్కొక్క రైలే నడుస్తుండడంతో వెయిటింగ్ లిస్టు చాంతాడంత వస్తోంది. వేలాంగిణి, మధురై, షిర్డి, ఢిల్లీ తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఒక్క రైలు మాత్రమే ఉండడంతో ప్రతినిత్యం రద్దీగా ఉంటోంది. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి రైళ్ల సంఖ్య పెంచాలి.
– మసూద్, కడప

క్లుప్తంగా

రెడ్డిపల్లెలో చోరీ


బీరువాలోని వస్తువులు చిందరవందరగా కింద వేసిన దృశ్యం

అట్లూరు : మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామంలో అంబంటి వెంకటేశ్వర్లు ఇంట్లో నగదుతోపాటు బంగారును దొంగలు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అంబంటి వెంకటేశ్వర్లు తన కుమారుడు, కోడలు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండటంతో అక్కడికి నాలుగు రోజుల క్రితం వెళ్లాడు. అయితే ఇంటిని తన అల్లుడు డబ్బుగొట్ల వెంకటేష్ పర్యవేక్షిస్తుండటం జరిగింది. వెంకటేష్ మంగళవారం మధ్యాహ్నం ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా ఓపెన్ చేసి చెల్లాచెదురుగా బట్టలు పడేసి అందులో ఉన్న రూ.20 వేల నగదుతోపాటు 22 గ్రాముల బంగారు గొలుసును అపహరించుకుని పోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని తన మామ వెంకటేశ్వర్లుకు తెలిపానని అతను పేర్కొన్నారు. పోలీసులు వచ్చి ఇంటిని పరిశీలించారు. వారు విచారణ చేస్తున్నారు.

రిమాండ్ పొడిగింపు


ఒంటిమిట్ట : మండల పరిధిలోని పెన్నపేరూరు గ్రామంలో ఈ నెల 12వ తేదీన దళితుడిపై నూనె పోసి దాడి చేసిన సంఘటన విదితమే. ఇందులో నిందితుడిగా ఉన్న గజ్జల చిన్న పుగారి వెంకటసుబ్బారెడ్డికి కోర్టు గతంలో ఈ నెల 30వ తేదీ వరకు రిమాండ్ విధించింది. మంగళవారం ఆఖరి రోజు కావడంతో.. రిమాండ్‌ను మరలా 14 రోజులు పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఒంటిమిట్ట ఎస్‌ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

రారండోయ్.. అంజన్న వైభవం చూద్దాం..

- ఆగస్టు 5 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు
- గండి వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు
- పెద్ద ఎత్తున భక్తుల రాక

చక్రాయపేట : శ్రావణ మాసం అంటే ఆంజనేయుడికి ఎంతో ప్రీతికరం. అలాగే ఆ స్వామి భక్తులకు ఈనెల అంటే ఎంతో ఇష్టం. ఆయన గుళ్లు ప్రత్యేక అలంకరణకు నోచుకుంటాయి. ఎక్కడ చూసినా భక్తులతో కిటకిటలాడుతాయి. ఈ నేపథ్యంలో రాయలసీమ జిల్లాల్లో ప్రసిద్ధి గాంచిన గండి వీరాంజనేయస్వామి ఆలయంలో ఎంతో వైభవంగా జరుగుతాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఆగస్టు 5 నుంచి శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయ చరిత్రను పూర్వీకులు కథలుగా చెబుతున్న విషయాన్ని ఓ మారు గుర్తుకు చేసుకుందాం.


గండి వీరాంజనేయస్వామి మూలవిరాట్


గండి వీరాంజనేయ స్వామి సన్నిధి

సీతాదేవి కోరిక మేరకు..

రావణ సంహరణానంతరం సీతా సమేతుడైన శ్రీరామచంద్రమూర్తి తిరిగి అయోధ్య వెళుతున్న సమయాన గండి క్షేత్రానికి వచ్చే సరికి చీకటి పడిందట. ఈ సమయంలో కొండకు కనిపించిన పెద్ద రాయిని చూసిన సీతకు అక్కడ తెల్లవారుజామున శుభగడియలు ముగిసేలోపు ఆంజనేయుడి విగ్రహాన్ని బాణపు ములికితో చెక్కాలని కోరిందట. దీంతో శ్రీరాముడు ఆమె కోరిక మేరకు ఆంజనేయుడి విగ్రహాన్ని చెక్కడం ప్రారంభించారు. శుభగడియలు ముగిసే సరికి ఆంజనేయుడి ఎడమచేయి చిటికెన వ్రేలు మాత్రమే కొదవ పడటంతో.. ఆ ప్రయత్నం అంతటితో ఆపేసి విగ్రహాన్ని ప్రతిష్ఠింప జేశాడు. అనంతరం పూర్వీకులు భిన్నంగా ఉన్న విగ్రహం పూజలకు పనికి రాదని భావించి చిటికెన వ్రేలిని చెక్కించేందుకు శిల్పిని రప్పించి పని ప్రారంభించారు. శిల్పి వేసిన ఉలి దెబ్బ పడగానే ఆచోటి నుంచి రక్తం రావడంతో భయపడి మూర్ఛ చెంది పడిపోయారు. అనంతరం ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. సీతాదేవి ఆంజనేయుడిని చిరంజీవిగా వర్ధిల్లు అని ఆశీర్వదించినట్లుగా ఆయన ఇక్కడ సజీవంగా ఉన్నాడని భావించి అప్పటి నుంచి పూజలు చేస్తున్నారు. దీంతో ఇక్కడి ఆంజనేయుడిని భక్తులు ఎంతగానో నమ్ముతారు.

బంగారు తోరణం

గండిలో సీతాసమేతంగా విచ్చేస్తున్న శ్రీరాముడికి స్వాగతం పలికేందుకు గండిలో తపస్సు చేసుకుంటుండిన వాయుదేవుడు.. రెండు కొండల మధ్యన బంగారు తోరణం నిర్మించి వారికి స్వాగతం పలికాడట. ఆ బంగారు తోరణం నేటికి కూడా ఉందని భక్తుల నమ్మకం. అది పుణ్యాత్ములకు మాత్రమే కనిపిస్తుందట. ఇప్పటి వరకు ఆ తోరణం ఇద్దరికి మాత్రమే కనిపించిందట. వారిలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉన్న సమయంలో జిల్లా కలెక్టరుగా ఉండిన సర్ థామస్ మన్రో ఒకరు కాగా, గండి భూమానందాశ్రమ పీఠాధిపతి రామానందస్వామి మరొకరట.

గండి అంటే..

గండిలో ఉన్న కొండలను శేషాచల కొండలు అంటారు. ఇవి తిరుమల నుంచి గండి వరకు మధ్యలో ఎక్కడేగానీ తెగువ లేకుండా ఉన్నాయట. అలాంటి ఈ శేషాచల కొండలను పాపాఘ్ని నది మధ్యలో గండి పెట్టిందట. దీంతో ఈ ప్రాంతానికి గండి అని పేరు వచ్చిందట. ఇక్కడ వెలసిన స్వామిని గండి వీరాంజనేయస్వామి అని పిలుస్తారు.

పాపాఘ్ని నది

నందిపాద సముద్భూతా పాపాఘ్ని పుణ్యదాయినీ అని వాయు పురాణం చెప్పింది. నంది పాదం అనగా కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లాలోని నంది కొండల్లో పుట్టి గండి మీదుగా కమలాపురం సమీపంలోని పెన్నా నదిలో కలుస్తుంది. ఈ నది పాపాలను హరించి వేస్తుందని, అందుకే దీన్ని పాపాఘ్ని నది అని పిలుస్తారు.

దర్శనీయ స్థలాలు

గండి క్షేత్రం సమీపంలో పలు దర్శనీయ స్థలాలు ఉన్నాయి. వాటిలో ఉమామహేశ్వరాలయం, భూమానందాశ్రమం, నామాలగుండు, పావురాళ్ల గట్టు, దాసరయ్యకోన, మాతంగ గుహ, ప్రేమానందాశ్రమం, చౌడేశ్వరీదేవి ఆలయం, గవిమల్లేశ్వర స్వామి ఆలయం, కోదండ రామాలయం, గంగమ్మ దేవత ఆలయం, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్మృతివనం ఉన్నాయి.

భక్తులు సహకరించాలి



శ్రావణమాసంలో గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శ్రావణ మాస ఉత్సవాలకు భక్తులతోపాటు అన్ని శాఖల అధికారులు సహకరించాలి. విద్యుద్దీపాలతో అలంకరణ, క్యూ లైన్‌లు, తాగునీటి వసతి, అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలు, చలువ పందిళ్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక సదుపాయాలు, స్నానఘట్టాలు, వైద్యశిబిరం తదితరాలు ఏర్పాటు చేశాం. భక్తుల సౌకర్యార్థంగా విశాలమైన జర్మన్ షెడ్ ఏర్పాటు చేయాలని టీటీడీ వారిని కోరాం. ముఖ్యంగా ట్రాఫిక్ విషయంలో వాహనదారులు పోలీసుల సూచనలు పాటించాలి.

- వెంకట సుబ్బయ్య,
ఆలయ సహాయ కమిషనర్

రూ.20 కోట్లతో ఆలయ పునర్నిర్మాణ పనులు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ పాలనలో గండి ఆలయానికి రూ.20 కోట్ల మేర మంజూరు చేయించారు. ఈ నిధులతో ఆలయ పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పూర్తిగా గ్రానైట్‌తో నిర్మిస్తున్నారు. చరిత్రలో నిలిచిపోయేలా, హిందూ సంప్రదాయం ఉట్టి పడేలా, ఆలయంలో అడుగిడగానే గొప్ప అనుభూతి కిలోనై భక్తి భావం పెంపొందేలా, కళానైపుణ్యం అబ్బుర పరచే రీతిలో 130 రాతి స్తంభాలతో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆలయం నిర్మాణంలో ఉండటంతో ఇక్కడ బాలాలయం నిర్మించి ధారువుతో చేయించిన స్వామి విగ్రహాన్ని ఉంచి భక్తులకు పూజలు చేయిస్తున్నారు.


గండిక్షేత్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆలయం

జిల్లా ఆస్పత్రి మార్చురీ వద్ద ఆందోళన

ప్రొద్దుటూరు క్రైం : పోస్టుమార్టం చేసిన మృతదేహాలపై ఎక్కువగా కోతలు ఉన్నాయంటూ మృతుల కుటుంబ సభ్యులు మంగళవారం జిల్లా ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. దువ్వూరు మండలంలోని తెలుగుగంగ ఎస్‌ఆర్-1 రిజర్వాయర్‌లో పడి ప్రొద్దుటూరుకు చెందిన ముగ్గురు యువకులు మృతి చెందిన విషయం తెలిసిందే. వీరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించే ముందు మృతదేహాలకు ఎక్కువ కోతలు లేకుండా చూడాలని వైద్యాధికారులను కోరారు. ఈ క్రమంలో వైద్యులు నిబంధనలను అనుసరించి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. అయితే మృతదేహాలపై ఎక్కువగా కోతలు ఉన్నాయంటూ బంధువులు, సన్నిహితులు ఆందోళనకు చేశారు. వైద్యులు, ఆస్పత్రి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది. విషయం తెలియడంతో డీఎస్పీ మురళీధర్‌తోపాటు పట్టణంలోని సీఐలందరూ అక్కడికి చేరుకున్నారు. ముస్లిం పెద్దలకు, పోలీసు అధికారులకు సర్ది చెప్పడంతో సద్దుమణిగింది. తర్వాత ముగ్గురు యువకుల మృతదేహాలను తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుత్ చౌర్యంపై దాడులు


విద్యుత్ అక్రమంగా వినియోగిస్తున్న షెడ్‌లను తనిఖీ చేస్తున్న విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు

కడప కార్పొరేషన్ : విద్యుత్ చౌర్యం చేస్తున్న వారిపై విద్యుత్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. కడప విజిలెన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ ఆధ్వర్యంలో కడప, సిద్దవటం మండలాల్లోని పలు ప్రాంతాల్లో దాడులు చేశారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 40 మందిపై కేసులు నమోదు చేసి, రూ.2 లక్షల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఈఈ రమేష్ మాట్లాడుతూ విద్యుత్‌ను అక్రమంగా వినియోగించడం చట్టరీత్యా నేరమని, విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మధులత, ఏఈలు రామాంజనేయరెడ్డి, మస్తాన్, రవి, నాగరాజు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పాతబస్టాండ్ నుంచి రవీంద్రనగర్‌కు వెళ్లే దారిలో చిన్నచౌక్ ప్రాంతానికి చెందిన షేక్ ఫరీద్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి కిలో 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భాస్కర్‌రెడ్డి తెలియజేశారు.

■ కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాయల్‌థియేటర్ వెనుకవైపున మట్కా రాస్తున్న అబ్దుల్ రజాక్, ఆంజనేయ ప్రసాద్‌రెడ్డిలను సీఐ భాస్కర్‌రెడ్డి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.11,150 నగదును సీజ్ చేశారు.

నకిలీ ఏజెంట్ల కార్యాలయాలపై దృష్టి సారించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : గల్ఫ్ దేశాలకు అక్రమ మార్గంలో పంపిస్తామని చెప్పి, మోసం చేసే నకిలీ ఏజెంట్ల కార్యాలయాలపై చర్యలు తీసుకోవాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా విజ్ఞప్తి చేశారు. ఆయన స్థానికంగా సోమవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు స్థానికంగా పనులు దొరకక కువైట్ దేశాలకు వెళ్తుంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. గౌస్, నగర సహాయ కార్యదర్శి ఎస్.హుస్సేన్, నాయకులు యస్.దస్తగిరి పాల్గొన్నారు.

కడప జట్టు జయకేతనం


క్రికెట్ పోటీల్లో మ్యాచ్ ఆడుతున్న కడప, శ్రీకాకుళం జట్లు


ప్రణీత్ పవన్
(158 పరుగులు)


దేవాశిష్
(6 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు విజయం సాధించింది. 452 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు మూడోరోజు మంగళవారం మరో మూడు పరుగులు చేసి 455 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఆర్థిత్‌రెడ్డి 30 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. శ్రీకాకుళం బౌలర్లు జున్నారావు 4, పూర్ణ 2, సుశాంత్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 65.3 ఓవర్లలో 192 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులో ఎం.అభయ్ 67, సాయిసుజన్ 33 పరుగులు చేశారు. కడప బౌలర్లు ఎ.నాగకుళ్లాయప్ప 5, ధీరజ్ కుమార్‌రెడ్డి 2, ఆర్థిత్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. దీంతో కడప జట్టు 59 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా శ్రీకాకుళం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 204 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

విశాఖ జట్టు విజయం

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖ జట్టు విజయకేతనం ఎగురవేసింది. మూడోరోజు పశ్చిమగోదావరి జట్టు 86.2 ఓవర్లలో 337 పరుగులు వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ప్రవీణ్ పవన్ 158 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మహబూబ్ 50 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్లు దేవాశిష్ 6 వికెట్లు, రోహిత్ 2 వికెట్లు తీశారు. దీంతో విశాఖ జట్టు 69 పరుగుల తేడాతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో విశాఖ జట్టు 171 పరుగులు చేయగా, పశ్చిమ గోదావరి జట్టు 131 పరుగులు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో విశాఖ జట్టు 366 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.

డ్రాగా ముగిసిన కృష్ణ, చిత్తూరు మ్యాచ్

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన కృష్ణ, చిత్తూరు మ్యాచ్ డ్రాగా ముగిసింది. 331 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 117.3 ఓవర్లలో 391 పరుగులు వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని గౌతమ్‌కృష్ణ 132 పరుగులు చేశాడు. కృష్ణా బౌలర్లు రాజేష్ 5, సాయిప్రకాష్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కృష్ణా జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 53 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. జట్టులోని నిశ్చయ్ 52, ఖాజామోహిద్దీన్ 47 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు సాయిచరణ్ 2, బాలాజీ 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కృష్ణా జట్టు 396 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కృష్ణా జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

టి.కోడూరులో పోలీస్ పికెట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న గన్, బుల్లెట్లు


గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్

కొండాపురం : మండలంలోని టి.కోడూరు గ్రామంలో ఆధిపత్యం కోసం ఎన్‌డీఏ కూటమి నాయకుల మధ్య ఆదివారం ఘర్షణ చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోడూరుకు చెందిన చింతాకు పవన్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ ఎల్.రామమునిరెడ్డి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు రాళ్లు వేసుకున్నారు. ఇరువర్గాల వారికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే దీంతో ఎంపీటీసీ రామమునిరెడ్డి ప్రాణహాని జరుతుందని గాలిలో గన్‌తో ఒక రౌండు కాల్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై ఇరు వర్గాలకు చెందిన 29 మందిపై కేసు నమోదు చేసి, గన్ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

బ్యాంకును మోసగించిన కేసులో కాంగ్రెస్ నేత అరెస్ట్

- శంషాబాద్‌లోని ఇద్దరు ఇండస్‌ఇండ్ బ్యాంక్ మేనేజర్లు కూడా..
- ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఖాతా నుంచి రూ.40 కోట్లు బదిలీ
- ఖాతాదారునికి తెలియకుండా అనధికారికంగా లావాదేవీలు


బషీద్

సాక్షి, సిటీబ్యూరో: బ్యాంక్ ఖాతాదారునికి తెలియకుండా రూ.40 కోట్లు కాజేసిన కేసులో ఇద్దరు బ్యాంక్ మేనేజర్లతో సహా కాంగ్రెస్ నాయకుడు షేక్ బషీద్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. బషీద్ ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ తరఫున రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశాడని సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) డీసీపీ కె.ప్రసాద్ తెలిపారు. కేసు పూర్తి వివరాలివీ.. ముంబైలోని నారిమన్ పాయింట్‌లోని ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఖాతా ఉంది. బ్యాంక్ అంతర్గత ఆడిట్‌లో భాగంగా జూలై 12న ఈ ఖాతా నుంచి శంషాబాద్‌లోని ఇండస్‌ఇండ్ బ్యాంచ్‌కు రూ.15 కోట్లు, రూ.25 కోట్లుగా రెండు విడతల్లో రూ.40 కోట్ల నగదు బదిలీ అయినట్లు బ్యాంక్ అధికారులు గుర్తించారు. ముంబైలోని ప్రధాన కార్యాలయం అనుమతి లేకుండా అనధికారికంగా ఈ నగదు బదిలీ జరిగినట్లు తేలడంతో జోనల్ హెడ్‌ను అప్రమత్తం చేశారు. దీంతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ జోనల్ హెడ్ (ఆపరేషన్స్) మణికందన్ రామనాథన్ జూలై 19న సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బ్యాంక్ మేనేజర్ల పనే..

శంషాబాద్‌లోని ఇండస్ ఇండ్ బ్యాంక్ మేనేజర్ కనుగుల రామస్వామి, సర్వీస్ డెలివరీ మేనేజర్ సపాయి రాజేశ్ ఈ వ్యవహారంలో కీలక సూత్రధారులు. ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ ఖాతాలో కోట్లలో జరుగుతున్న లావాదేవీలను గుర్తించిన ఇరువురు నిందితులు పక్కా పథకం వేశారు. జూలై నెలలో జూబ్లీహిల్స్‌కు చెందిన వ్యాపారి షేక్ బషీద్ పేరుతో బ్యాంక్ అకౌంట్‌ను తెరిచారు. ఈ ఖాతాకు ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ చెక్, ఆర్టీజీఎస్ లేకుండా అనధికారికంగా రూ.40 కోట్ల నగదును బదిలీ చేశారు. క్షణాల్లోనే ఈ అకౌంట్ నుంచి జాతీయ, ప్రైవేట్ బ్యాంక్‌ల్లోని 20 వేర్వేరు ఖాతాలకు బదిలీ చేశారు. ఈ సొమ్ములో కొంత మొత్తాన్ని వేర్వేరు ఏటీఎంల నుంచి విత్ డ్రా చేశారు.

బహుమతిగా ఫార్చ్యూనర్ కార్లు

కొట్టేసిన సొమ్ముతో బషీద్ రెండు టయోటా ఫార్చ్యూనర్ కార్లను కొనుగోలు చేశాడు. వీటిలో ఒకటి బ్యాంక్ మేనేజర్ రామస్వామికి బహుమతిగా అందించాడు. ఆ తర్వాత మిగిలిన సొమ్ముతో బషీద్ ఢిల్లీకి పరారయ్యాడు. సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు నిందితులు రామస్వామి, రాజేష్‌లను హైదరాబాద్‌లో, బషీద్‌ను ఢిల్లీలో అరెస్టు చేశారు. వీరిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.